సాక్షి
నల్లగొండ
ఆదివారం । 12 । మే । 2024



ర్యాండమైజేషన్ పూర్తి

నల్లగొండ కలెక్టరేట్‌లో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ అధికారుల సమక్షంలో శనివారం పూర్తిచేశారు. - 2లో



కాంగ్రెస్‌కే బ్రాహ్మణుల మద్దతు

బ్రాహ్మణులంతా కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు తెలిపారు. - 2లో

గరిష్ఠం / కనిష్ఠం
41°/ 27°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మూసీకి 815 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నీటి చేరికతో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. మూసీ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో చేరుతుంది. రెండు రోజుల క్రితం వరకు 300 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం 815 క్యూసెక్కులకు పెరిగింది. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 627.50 అడుగులకు (1.08 టీఎంసీలు) చేరుకుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో కాల్వలకు నీటి విడుదల నిలిపివేసే నాటిని రిజర్వాయర్‌లో నీటిమట్టం 618 అడుగులకు తగ్గగా.. నెల రోజుల వ్యవధిలో నీటిమట్టం తొమ్మిది అడుగులు పెరిగింది.

యాదాద్రిలో భక్తుల మొక్కులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ష్.. గప్‌చుప్!

శనివారం సాయంత్రం ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం

- చివరిరోజు బైక్ ర్యాలీలు, రోడ్‌షోలతో హోరెత్తించిన పార్టీలు
- అభ్యర్థులు, నేతల సుడిగాలి పర్యటన
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పార్టీలు, నాయకుల ఎత్తులు



సూర్యాపేట : సైదిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై



మిర్యాలగూడ : బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. చివరి రోజు అన్ని పార్టీలు ముమ్మర ప్రచారం చేశాయి. పట్టణాలు, గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించాయి. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేయడంతోపాటు.. నేతలు కూడా సుడిగాలి పర్యటనలు చేశారు. ప్రచారం బంద్ కావడంతో మైకులన్నీ మూగబోయాయి. ఇక, ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు, పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి.

నామినేషన్ల ఘట్టం ముగియగానే..

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ ఘట్టం ముగిసిన నాటి నుంచి అన్ని ప్రధాన పార్టీలు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ముమ్మర ప్రచారం చేశాయి. ఆయా రాజకీయ పార్టీకు చెందిన అభ్యర్థులు, ముఖ్య నేతలు, జాతీయ, రాష్ట్ర నేతలు, స్థానిక నాయకులు, క్షేత్ర స్థాయిలో కార్యకర్తల ప్రచారాలతో నిన్నటి వరకు గ్రామాలు, పట్టణాలు హోరెత్తాయి. ఎక్కడ చూసినా పార్టీలు, అభ్యర్థుల ప్రచారాల ప్రచార రథాలు మైక్‌లతో వీధుల్లో సందడి చేశాయి.

ఇక ప్రలోభాలతో ఎర..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగియడంతో.. ఆయా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టేలా మద్యం, డబ్బు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే అక్కడక్కడా మద్యం ఇచ్చేందుకు తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆయా పార్టీలు అసెంబ్లీ ఎన్నికల తరహాలో కాకపోయినా.. ఎంతో కొంత పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మద్యంతోపాటు అంతటా ఓటర్లకు రూ.300 ఇవ్వాలని ఆయా పార్టీల నేతలు చర్చించుకున్నట్లు తెలుస్తోంది.

చివరి రోజు భారీగా ర్యాలీలు

శనివారం ప్రచారానికి చివరి రోజు కావడంతో అన్ని రాజకీయ పార్టీలు పట్టణాలు, గ్రామాల్లో భారీ ఎత్తున ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేశారు. వార్డులు, వీధుల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలతో ఆయా పార్టీలు జెండాలు పట్టుకొని ప్రచారం చేశారు.

- మిర్యాలగూడలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మునుగోడులో కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి.. చౌటుప్పల్, మునుగోడులో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. హుజూర్‌నగర్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు మద్దతుగా లాయర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లగొండలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ప్రచారంతోపాటు బైక్ ర్యాలీలు చేపట్టారు.
- బీజేపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి సూర్యాపేటలో ప్రచారం నిర్వహించారు. ఆయన తరఫున బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు, సూర్యాపేటతోపాటు నల్లగొండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మునుగోడు నియోజక వర్గంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.
- నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



నకిరేకల్ : బీఆర్‌ఎస్ పార్టీ రోడ్‌షోకు హాజరైన ప్రజానీకం

90 శాతం పోలింగ్ నమోదు కావాలి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని 80 నుంచి 90 శాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన, కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్‌దాస్ పిలుపునిచ్చారు. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా శనివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించిన క్యాండిల్ వాక్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో 61 వేల మంది నూతన ఓటర్లు నమోదయ్యారని.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి ప్రజాసామాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేస్తామని క్యాండిల్ వాక్‌కు వచ్చిన వారందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, సక్కుబాయి తదితరులున్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరిచందన, వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్‌దాస్

పోలింగ్ సామగ్రి పంపిణీకి సన్నద్ధం

నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీకి అధికారులు సన్నద్ధమవుతున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్ల (డీఆర్‌సీ)ల వద్ద పోలింగ్ సిబ్బందికి ఆదివారం సామగ్రి అందజేయనున్నారు. అక్కడి నుంచి సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు. శనివారం సిబ్బందికి పోలింగ్ కేంద్రాలు కేటాయింపు పూర్తయింది. సిబ్బంది ఆదివారం డీఆర్‌సీలకు సిబ్బంది చేరుకుని, అక్కడి నుంచి సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు వెళ్లనున్నారు.

2061 పోలింగ్ స్టేషన్లు

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 2061 పోలింగ్ స్టేషన్లకు 5,150 బ్యాలెట్ యూనిట్లు, 2575 కంట్రోల్ యూనిట్లు, 2883 వీవీ ప్యాట్లు పంపించనున్నారు. డీఆర్‌సీల నుంచి సిబ్బందిని తరలించేందుకు 1,925 వాహనాలను వాడుతున్నారు. 2,435 బృందాలు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నాయి. ఒక్కో బృందంలో నలుగురు పోలింగ్ అధికారులు, సిబ్బంది ఉండనున్నారు.



ఎన్‌జీ కళాశాల వద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్



డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద టేబుళ్లు, కుర్చీలు

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

- ఎన్నికల విధులకు మూడు వేల మంది
- 7 కంపెనీల కేంద్ర బలగాలు, 5 ప్రత్యేక ఫోర్స్ ప్లాటూన్లు
- 313 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

నల్లగొండ క్రైం : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. మూడు వేల మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ కేసుల్లో ఉన్న 973 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశారు. వ్యక్తిగతంగా ఆయుధాలు పొందిన 116 మంది నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. 313 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై మరింత నిఘా పెంచారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై పోలీసులు సమగ్ర సమాచారాన్ని తెలుసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

జిల్లా ఎస్పీతో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 84 మంది ఎస్‌ఐలతో కలిపి మూడు వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. అదనంగా ఏడు కంపెనీల కేంద్ర బలగాలు, మరో 5 ప్రత్యేక ఫోర్స్ ప్లాటూన్లు, పెట్రోలింగ్ పార్టీలు, అత్యవసరంగా సంఘటన వద్దకు చేరుకునేలా క్విక్ రియాక్షన్ టీమ్‌లు, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎక్కడ సమస్య వచ్చినా, ఘర్షణ వాతావరణం ఏర్పడిన నిమిషాల వ్యవధిలో అక్కడకు పోలీసు బలగాలు చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో పెట్టారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని పోలీసులు హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం, బంగారు ఆభరణాలు ఇతర విలువైన వస్తువులు ఇవ్వడానికి ప్రయత్నిస్తే సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు 100కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి



మునుగోడులో ఓట్లు అభ్యర్థిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : దేశ సంపదను పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్న బీజేపీని, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను ఓడిస్తేనే దేశం, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మునుగోడులో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించేందుకు సిద్ధమైందన్నారు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగాన్ని రద్దుచేసి రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ప్రజలు గమనించి ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి, ఎంపీపీ కర్నాటి స్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బూడి లింగయ్యయాదవ్, భీమనపల్లి సైదులు, జితేందర్‌రెడ్డి, మేకల ప్రమోద్‌రెడ్డి, అన్వర్, బాస్కర్, గోవర్ధన్‌రెడ్డి, సైదులు, లింగస్వామి, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి మల్లేష్, చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపు కోసం శనివారం సాయంత్రం నకిరేకల్‌లో నిర్వహించిన రోడ్డుషోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు ఇవ్వలేదు, రూ.2లక్షల రుణామాఫీ లేదు, మహిళలకు రూ.2500 ఇవ్వలేదు, 24 గంటల కరెంటు కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ దొంగలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేసింది కేసీఆర్ అని.. కేసీఆర్‌ను నమ్ముకుంటే తెలంగాణ బాగుపడతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే జిల్లా ఎడారిగా మారుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ ప్రజలు ఆలోచన చేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, యాదాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, బలరాం, స్వర్ణలత, మాజీ మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నాయకులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, మారం వెంకట్ రెడ్డి, సోమ యాదగిరి, విజయ్, సైదులు, సామ శ్రీనివాస్‌రెడ్డి, యానాల లింగారెడ్డి, గుర్రం గణేష్, చెవుగోని అఖిల, రాచకొండ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

- హైవేపై ఎన్నికల రద్దీ



హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసించే వారు సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ హైవేపై పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

హోరెత్తుతున్న సెల్‌ఫోన్ ప్రచారాలు

భువనగిరిటౌన్: ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రతిఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంటుండడంతో అభ్యర్థులు వాటినే తమ ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటున్నారు. ప్రధాన పార్టీల నాయకులు తమ వాయిస్ రికార్డు చేసి తమకు ఓటు వేయాలని ఓటర్లకు ఫోన్ కాల్స్ చేస్తున్నారు. కాగా ఈ ఫోన్ కాల్స్ ఎప్పుడు పడితే అప్పుడు వస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

నల్లగొండ: కలెక్టరేట్‌లో శనివారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. పోలింగ్ సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన, సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, నల్లగొండ ఏఆర్‌ఓ రవికుమార్, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్, సూర్యనారాయణ, వేణుమాధవ్, ఇన్ఫర్మేటిక్ అధికారి రావులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకుడు

● ర్యాలీల జోరు



సూర్యాపేట: ర్యాలీగా వస్తున్న బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



నకిరేకల్ పట్టణంలో బీఆర్‌ఎస్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు



మోత్కూరు పట్టణంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



మోత్కూరు మండలం ముశిపట్లలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



భువనగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీకే బ్రాహ్మణుల మద్దతు

● అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు

రామగిరి(నల్లగొండ): లోక్‌సభ ఎన్నికల్లో బ్రాహ్మణులందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో బ్రాహ్మణ సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. బ్రాహ్మణ సమాజం అంతా ఏకతాటి పైకి వచ్చి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి అక్కెల్ల శ్రీనివాస్, ఫణి ఆచార్య, గొల్లపూడి మారుతీశర్మ, పులిజాల యాదగిరిరావు, తుమ్మగోటి పవన్‌కుమార్, తేనేపల్లి శేఖర్, దర్బెల్లి రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు

ఖర్చుల లెక్కలను తనిఖీ చేయించుకోవాలి

● ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తమ ఎన్నికల ఖర్చులకు సంబంధించిన లెక్కలను తనిఖీ చేయించుకోవాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ అన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల మూడో విడత తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంకా ఎవరైనా అభ్యర్థులు ఖర్చులకు సంబంధించి రిజిస్టర్లు, ఖర్చులు సంబంధించిన వివరాలు మిగిలిపోయినట్లయితే తనిఖీ చేయించుకోవాలని, అలాగే జూన్ 30వ తేదీన నిర్వహించే కన్సాలిడేట్ తనిఖీకి సైతం అభ్యర్థులందరూ హాజరుకావాలని సూచించారు. కాగా ఈ తనిఖీకి 22 మంది అభ్యర్థులు, వారి తరఫున ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో సహాయ వ్యయ పరిశీలకుడు సురేష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సంక్షేమ పథకాలు

చండూరు: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తేనే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం చండూరు మున్సిపల్ పరిధిలోని అంగడిపేట గ్రామంలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నర్సింహ, ఓబీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, జిల్లా నాయకులు సముద్రాల వెంకన్న, బోడ ఆంజనేయులు, బూతరాజు శ్రీహరి, సోమ శంకర్, మాదగోని స్వామి, పేర్ల గణేష్, తడకమల్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు బొబ్బల శివ, దుస్స గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

● ఓటు హక్కుపై అవగాహన



నల్లగొండ: ఓటర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హరిచందన, ఎన్నికల పరిశీలకులు



నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, ట్రాన్స్‌జెండర్స్



తుంగతుర్తి: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎన్నికల సిబ్బంది



నల్లగొండ: క్యాండిల్ వాక్‌లో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు

ఓటేసేందుకు వెళ్తున్నాం..



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు



నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై హోటళ్ల వద్ద ఆగిన వాహనాలు

● ఈ ఎన్నికలు మాకు ఎంతో ముఖ్యం
● ఆంధ్రప్రదేశ్ వాసుల వెల్లడి

చౌటుప్పల్ : ఓటు వేసేందుకు ప్రజలు స్వగ్రామాల బాటపట్టారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు మాత్రమే జరుగుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలలో నివాసం ఉండే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఓటు వేసేందుకుగాను సొంతూళ్ల బాటపట్టారు. వరుస సెలవులు సైతం కలిసిరావడంతో కుటుంబాలతో కలిసి బయలుదేరారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పలువురు 'సాక్షి'తో మాట్లాడారు.

గొప్ప ఆశయం కోసం వెళ్తున్నాము



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు పార్టీలకే కాకుండా ప్రజలకు సైతం ఎంతో ప్రతిష్టాత్మకమైనవిగా చెప్పవచ్చు. అలాంటి ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఎంత దూరంలో ఉన్నా గొప్ప ఆశయం కోసం సొంతూరికి బయలుదేరాము. ఓటు వేసి ఆశయాన్ని గెలిపించుకుంటాము. - బాబుగౌడ్, నర్సాపురం, పశ్చిమగోదావరి

కుటుంబంతో కలిసి వెళ్తున్నాము



మా సొంతూరిలో ఓటు వేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాము. ఆ ప్రకారంగా ముందే సెలవులు సైతం రావడంతో కుటుంబంతో కలిసి వెళ్తున్నాము. అసెంబ్లీ ఎన్నికలు ఎంతో ముఖ్యం.
- విజయ్, కొత్తపేట, కోనసీమ జిల్లా

ఓటు వేసేందుకు వెళ్తున్నాము



మేము కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటాము. ఓటు మాత్రం మా సొంతూర్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు కావడంతో కచ్చితంగా ఓటు వేయాలన్న సంకల్పంతో వెళ్తున్నాము.
- వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట

ప్రతిసారి ఓటు వేస్తాను



ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఓటు వేస్తున్నాను. 2019 మాదిరిగానే అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కావున తప్పనిసరిగా ఓటు వేయాల్సి ఉంది. ప్రతిసారి ఓటుహక్కును వినియోగించుకుంటాను. - వసంత్‌కుమార్, మైలవరం

ఫలితాలు తారుమారు కావొద్దని



ఎన్నికల్లో ఒక్క ఓటు ఎంతో కీలకంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్క ఓటుతోనే అభ్యర్థుల తలరాత మారుతుంది. దూర ప్రాంతాలలో నివాసం ఉండే వ్యక్తులు ఓటింగ్‌లో పాల్గొనకపోతే ఫలితాలు తారుమారు అయ్యే ప్రమాదం ఉంటుంది. అలాంటి పరిస్థితి రావొద్దని మేమంతా ఓట్లకు వెళ్తున్నాము.
- శ్రీధర్, విశాఖ ఈస్ట్

మంచి తీర్పు రావాలని



ఓటు వేయడం మన హక్కు. ఓటుతో చక్కటి అభ్యర్థిని ఎన్నుకోవచ్చు. మార్పు కోరుకోవచ్చు. అందుకే అసెంబ్లీ నియోజకవర్గంలో మేము ఓటు వేసి మంచి అభ్యర్థిని గెలిపించుకోవాలని నిర్ణయించుకున్నాము. ఆ మేరకు స్వగ్రామానికి భయలుదేరాము.
- మురళి, కాకినాడ

ఊరి నుంచి పిలుపు వచ్చింది



ఎన్నికల నేపథ్యంలో మా స్వగ్రామం నుంచి మాకు పిలుపు వచ్చింది. కచ్చితంగా ఓటు వేసేందుకు రావాలని వివిధ పార్టీల నాయకులు అడిగారు. ఓటు వేయడం మన హక్కు కాబట్టి కుటుంబసభ్యులందరం కలిసి వెళ్తున్నాము.
- గోపాల్, నందిగామ, కృష్ణాజిల్లా

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

పెద్దఅడిశర్లపల్లి : ఆటో, లారీ ఢీకొనడంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి కోదాడ-జడ్చర్ల రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద అడిశర్లపల్లి మండలం గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మర్యాదాసు(55) శనివారం అర్ధరాత్రి ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా ఆటోలో వెళ్తుండగా కోదాడ - జడ్చర్ల రహదారిపై అంగడిపేట నయారా పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌తోపాటు నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. గాయపడిన వారిలో మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బోల్తా పడిన ఆటో



మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్

ఆటో, బైక్ ఢీకొని ఒకరు..

అత్మకూర్(ఎస్): మండలంలోని కోటినాయక్ తండా వద్ద శుక్రవారం రాత్రి బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాశీగూడెం గ్రామానికి చెందిన షేక్ సైదా (32) వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 11గంటల సమయంలో మండల పరిధిలోని కోటినాయక్ తండా వద్దకు రాగాను తాను నడుపుతున్న బైక్.. దంతాపల్లి నుంచి సూర్యాపేట వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సైదా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు సైదాకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి షేక్ బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ వై.సైదులుగౌడ్ తెలిపారు.



షేక్ సైదా(ఫైల్)

టీవీఎస్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

● భారీగా ఆస్తినష్టం
● నల్లగొండ పట్టణంలో ఘటన

నల్లగొండ రూరల్ : టీవీఎస్ బైక్ షోరూంలో శనివారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భారీగా ఆస్తినష్టం జరిగింది. పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో గల శ్రీఎల్‌వీ మోటార్స్ టీవీఎస్ బైక్ షోరూంలో ఉదయం వాహనాల స్పేర్ పార్ట్స్ ఉంచే ప్రాంతంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళా ఉద్యోగి ప్రమాదంలో చిక్కుకుపోవడంతో మిగిలిన సిబ్బంది అప్రమత్తమై ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం వారు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ షోరూంలో ప్లాస్టిక్ వస్తువులు, స్పేర్ పార్ట్స్, ఆయిల్ డబ్బాలు ఉండడంతో మంటలు వేగంగా వ్యాప్తిచెందాయి. అదే సమయంలో షోరూం సిబ్బంది ముందు భాగంలో ఉన్న పలు వాహనాలను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించారు. మంటలు భారీగా చెలరేగడంతో ఫైర్ సిబ్బంది ఎంత శ్రమించినా అదుపులోకి రాకపోవడంతో నకిరేకల్ నుంచి మరో అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో కొన్ని కంప్యూటర్లు, వాహనాల పత్రాలు, స్పేర్ పార్ట్స్ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సందేశ్‌కుమార్, సహాయ అగ్నిమాపక శాఖ అధికారి షణ్ముఖరావు, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, నల్లగొండ టూ టౌన్ సీఐ, ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి కారణాలు తెలుసుకున్నారు. ఆపరేషన్‌లో నకిరేకల్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ భీముడు, నల్లగొండ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్ ఆఫీసర్ రామనరసయ్య, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతి

● నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన

నల్లగొండ క్రైం: భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న సయ్యద్ వలీ (40) భవన నిర్మాణ రంగంలో కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఇతని భార్య బీబీ ఇంటి వద్దే ఉండేది. రోజు మద్యం తాగి వచ్చి గొడవ పడుతున్నాడని వలీ భార్య తన అల్లుడు రిజ్వాన్‌కు శనివారం ఫోన్ చేసి చెప్పింది. దీంతో రిజ్వాన్ తన స్నేహితుడైన నవీన్, సాజిద్‌లను వెంట తీసుకుని వలీ ఇంటికి వచ్చి అతనితో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. ఈ క్రమంలో వలీని తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయమై రక్తస్రావం అవుతూ కిందపడ్డాడు. దీన్ని గమనించిన ఇంటి పక్కవారు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వాహనం రావడంతో సయ్యద్ వలీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రి అవుట్ పోస్టు నుంచి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు భార్య బీబీని పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. గొడవ జరిగిన సమయంలో తాను లేనని తర్వాత విషయం తెలిసిందని పోలీసులకు తెలిపింది. దీంతో మృతుడు భార్య బీబీతో పాటు రిజ్వాన్, నవీన్, సాజిద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు పితృవియోగం

దేవరకొండ: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనీలాల్ శనివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆస్పత్రిలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆస్పత్రికి చేరుకొని కనీలాల్ పార్థివదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులున్నారు. కాగా కనీలాల్ 2019లో దేవరకొండ మండల పరిధిలోని రత్యతండా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.



కనీలాల్ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పిస్తున్న కేటీఆర్

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన శనివారం నార్కట్‌పల్లి-చిట్యాల మధ్య 56వ ట్రాక్ పక్కన చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే ట్రాక్ పక్కన ఒక గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు చిట్యాల స్టేషన్ మాస్టర్‌కు సమచారం అందింది. దీంతో రైల్వే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రైలు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడని గుర్తించినట్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు, అతనికి దాదాపు 30 నుంచి 40 వయస్సు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.